క్లుప్తంగా

పేదలకు బియ్యం పంపిణీ



మహిళకు బియ్యం పంపిణీ చేస్తున్న లక్ష్మి

అల్లిపురం: పేదలకు 3 కేజీల బియ్యం చొప్పున 33వ వార్డు మాజీ కార్పొరేటర్ పచ్చిరిపల్లి లక్ష్మి అందజేశారు. ప్రతి నెల చేపట్టే కార్యక్రమంలో భాగంగా ఆమె మంగళవారం పేదల ఇళ్లకు వెళ్లి బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల 25 మంది పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రత్యేక దినాలలో కూడా బియ్యం, చీరలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కుటుంబం చెంతకు మహరాష్ట్ర వాసి



రవీంద్ర యశ్వంత్‌ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న శ్రద్ధా బృందం

సీతమ్మధార: మూడేళ్ల తర్వాత రవీంద్ర యశ్వంత్ ఇంటికి చేరడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఇతనిది మహరాష్ట్రలోని విక్రమ్‌ఘడ్ తాలుకా వలావిపడ గ్రామం. అనారోగ్యానికి ముందు అతను అందరితో మంచిగా ఉండేవాడు. తర్వాతి కాలంలో భార్యాపిల్లలకు అతను దూరమయ్యాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చి అతన్ని వెతకడం మొదలుపెట్టారు. వైజాగ్‌లో పట్టుబడ్డ రవీంద్రకు ఏయూటీడీ, శ్రద్ధ సంస్థ అందించిన సేవలతో మామూలు మనిషి అయ్యాడు. వైజాగ్ నుంచి నేరుగా తమ్ముడు వలావికి అతన్ని అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, శ్రద్ధా సోషల్ వర్కర్ ఫర్హాన అన్సారీ తెలిపారు.

రిటైర్డ్ సీఐకి సీపీ సత్కారం



తులసీదాస్‌ను సన్మానిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో హార్బర్ సీఐగా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన తులసీదాస్‌ను పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం సన్మానించారు. తులసీదాస్ 1993లో కానిస్టేబుల్‌లో పోలీస్ శాఖలో చేరిన ఆయన పదోన్నతులపై ఇన్‌స్పెక్టర్‌గా రిటైర్ అయ్యారు. 25 ఏళ్ల పాటు విజయనగరంలో పనిచేశారు. అనంతరం ఎస్‌ఐగా ఆరిలోవ, ఎంవీపీ, పీఎం పాలెం పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వర్తించారు. తాజాగా హార్బర్‌గా సీఐగా ఉంటూ ఉద్యోగ విరమణ చేశారు.

బీజేపీ మహారాణిపేట మండల అధ్యక్షుడిగా దేవర



దేవర చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

మహారాణిపేట: భారతీయ జనతా పార్టీ మహారాణిపేట మండల అధ్యక్షుడిగా దేవర చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక షిప్పింగ్ డైరెక్టర్ ఆఫ్ ఇండియా వీఎస్‌టీ చక్రవర్తి, ఆర్వో తలాడి గిరిజ నేతృత్వంలో జిల్లా మండల నాయకుల సమక్షంలో మంగళవారం నిర్వహించారు. ఎన్నికైన దేవర చంద్రశేఖర్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మెడికల్ కన్వీనర్ రూపాకుల రవికుమార్, మైనార్టీ మోర్చా నాయకుడు ఒ. అల్బర్ట్, బీజేపీ నగర ఉపాధ్యక్షుడు చొక్కాకుల రాంబాబు, చితకల రాజుబాబు, ఎస్సీ మోర్చా దశమంతుల సుశీల, జి. రామతల్లి, దశమంతుల శ్రీనివాసరావు, జి. రాజు, వంటల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కొంగొత్త ఆశలతో..

2025

కొత్త సంవత్సరంలోకి • పాత ఏడాదికి గుడ్‌బై.. న్యూ ఇయర్‌కి వెల్‌కమ్
నూతనోత్సాహంలో యువత • విద్య.. ఉపాధి.. ఉద్యోగాల్లో రాణించాలంటూ ఆకాంక్ష

నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని యువతీ యువకులు కేరింతలు కొట్టారు. పాత సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ.. నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ ఎంజాయ్ చేశారు. నియోజకవర్గ పరిధి గల్లీ గల్లీలో హ్యాపీ న్యూ ఇయర్ సందడి నెలకొంది. మహిళలు ఇళ్ల ముందు పాత సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ.. హ్యాపీ న్యూ ఇయర్-2025కి స్వాగతం పలుకుతూ వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. రంగు రంగుల ముగ్గులు వేసి.. వాటిపై చెమ్కీలు అద్ది అందంగా అలంకరించారు.



కేక్‌పై డిజైన్ వేస్తున్న బేకరీ ఉద్యోగి



కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

దాబాగార్డెన్స్/అల్లిపురం/జగదాంబ: దక్షిణలో న్యూ ఇయర్ హంగామా అంబరాన్ని అంటింది. రాత్రి 9 గంటల నుంచే సందడి నెలకొంది. రోడ్లపై యువకులు కేరింతలు కొడుతూ బైక్ డ్రైవ్ చేస్తూ ఎంజాయ్ చేశారు. సరిగ్గా 12 గంటలకు న్యూఇయర్‌ను ఆహ్వానిస్తూ పెద్ద ఎత్తున కేరింతలు కొట్టారు. ప్రతిఒక్కరికి న్యూ ఇయర్ విషెస్ చెబుతూ ఆప్యాయత.. అనురాగాలు పంచుకున్నారు.

కేకలకుగిరాకీ..

న్యూ ఇయర్ సందర్భంగా బేకరీ దుకాణదారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన న్యూ ఇయర్ కేక్‌లు విరివిగా విక్రయించారు. కేజీ సాధారణ కేక్‌ను రూ.400 నుంచి రూ.500, ఐస్ కేక్‌లు రూ.600 నుంచి రూ.700కు పైగా విక్రయించారు. కేక్‌లు కొనుగోలు చేసేందుకు నగర ప్రజలు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. పలు చోట్ల కేకులు దొరక్క ప్రజలు ఇబ్బంది పడ్డారు.

మద్యం దుకాణాల వద్ద..

మద్యం దుకాణాల వద్ద మందుబాబుల హడావిడి కనిపించింది. కళాసీలు, కూలి పనులు చేసుకునే వారు.. దుకాణాల్లో పని చేసే వారు పలు మద్యం దుకాణాల వద్ద క్యూలో నిల్చుని న్యూ ఇయర్‌ను ఎంజాయి చేశారు.

నూతనోత్సాహంతో..

ఇదిలా ఉండగా.. యువత నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ.. దేవాలయాలు.. చర్చిలు.. మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. 2025 నుంచైనా మా తలరాతలు బాగుండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు. గతం గత: అంటూ ఈ ఏడాదిలో ఎలాగైనా లక్ష్య సాధన.. ఉపాధి.. ఉద్యోగావకాశాలు సాధించాలనే పట్టుదలతో యువత ఉంది. చేస్తున్న పనిలో గాని.. వ్యాపారంలో గాని వృద్ధి చెందాలంటూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

అందరూ బాగుండాలి.. అందులో మనముండాలి..



హుదూద్, కరోనా వంటి విపత్తుల వల్ల ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. ఈ కొత్త సంవత్సరంలో అయినా అందరూ సుఖ సంతోషాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. మనతో పాటు అందరూ బాగుండాలని కోరుకుందాం.

– తంగిరాల మణిభూషణ్, వన్‌టౌన్.

ప్రగతి సాధించాలి..



ఈ ఏడాది ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు అందరూ ప్రగతి సాధించాలి. గత వైఫల్యాలను అధిగమించి అందరూ గెలుపు బాట సాగాలి. 2025లో యువతకు మేలు జరగాలి. విద్య, ఉద్యోగాల్లో అనుకున్న లక్ష్యాలు సాధించాలని ఆశిద్దాం.

– కొంద్రు నరేంద్ర చౌదరి, వెలంపేట

పదోన్నతిపై విదేశాలకు వెళ్తా..



నా కలలను 2025 నెరవేరుస్తుందని ఆశిస్తున్నాను. కాగ్నిజెంట్‌లో సీనియర్ డెవలపర్‌గా ఉద్యోగం చేస్తున్నాను. ఈ ఏడాది పదోన్నతిపై యూఎస్, యూకే, ఆస్ట్రేలియా వెళ్లాలని అనుకుంటున్నాను. నా ఆశయం నెరవేరుతుందని ఆశిస్తూ అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నాను.

– పాల హర్షవర్ధన్‌రెడ్డి, కుమ్మరవీధి, అల్లిపురం

టీవీ, సినీ కళాకారుల సందడి..



కేక్ కట్ చేస్తున్న పీతల వాసు, కళాకారులు

దాబాగార్డెన్స్: ప్రజలకు వినోదాన్ని అందించే టీవీ, సినీ కళాకారులు నూతన సంవత్సరం సందర్భంగా సందడి చేశారు. నగరంలోని నోవాటెల్ బీచ్ పార్కు వద్ద మంగళవారం కేక్ కట్ చేసి 2025 సంవత్సరానికి ఆహ్వానం పలికారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పీతల వాసు చేతుల మీదుగా కేక్ కట్ చేసి తినిపించుకున్నారు. ఈ సందర్భంగా పీతల వాసు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో టీవీ, సినీ కళాకారులకు మంచి జరగాలని అభిలషించారు. విశాఖకు సినిమా ఇండస్ట్రీ తరలి వస్తే అవకాశాలు మెరుగుపడతాయని, అందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సినిమా, టీవీ కళాకారులు వై. నాగేంద్రమ్మ, గౌరిపాటి శివ, గౌరిపాటి లక్ష్మి, సూర్య, పార్టీ నాయకులు గొలగాని మధు, పైబోడి శివకుమార్, యలమంచిలి నవనీత్, పీతల రాజు పాల్గొన్నారు.



రంగవల్లికలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న మహిళలు

సరిగ్గా ఐదేళ్ల కిందట..

- ఆర్టీసీ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు
- కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపిన అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

దాబాగార్డెన్స్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) ఉద్యోగులు, కార్మికులు 2020 జనవరి ఒకటి నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా నిర్ణయిస్తూ అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జీవో అమలు చేస్తూ సిబ్బంది.. వారి కుటుంబాల్లో వెలుగులు నింపారు. ఆర్టీసీ నష్టాల్లో ఉన్నా.. ససేమిరా అంటూ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆ రోజుకి ఆర్టీసీ రూ.6,400 కోట్ల మేరకు నష్టాల ఊబిలో కూరుకుపోయింది. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. 2020 జనవరి ఒకటి నుంచి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగానే కొనసాగుతున్నారు. ఉద్యోగ భద్రత కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డిని పలువురు ఉద్యోగులు, కార్మికులు.. వారి కుటుంబాలు మహానుభావుడంటూ హర్షం వ్యక్తం చేస్తూ చారిత్రాత్మక సంఘటనగా పరిగణిస్తూ జేజేలు కొట్టారు, సంబరాలు జరుపుకున్నారు. ఇక నుంచి తాము కూడా పూర్తి స్థాయి ప్రభుత్వ ఉద్యోగులుగా మారి పెన్షన్, తదితర సౌకర్యాలను అర్హతకు అనుగుణంగా అందుకోగలమన్న విశ్వాసం వారిలో బలపడింది.

గెడ్డలు పరిశీలించిన కమిషనర్



వ్యర్థాల తొలగింపు ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

కంచరపాలెం: నగరంలోని ప్రధాన గెడ్డల్లో గల వ్యర్థాలు యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జోన్-4 పరిధిలో గల గంగులగెడ్డ, జోన్-5 పరిధిలో గల ఎర్రి గెడ్డలను ప్రధాన ఇంజినీర్ పి. శివప్రసాదరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం పోర్టు వద్ద సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ సమీపంలో కలుస్తున్న గంగుల గెడ్డ, ఎర్రిగెడ్డలోని వ్యర్థాల వెలికితీత పనులు పరిశీలించామన్నారు. వ్యర్థాలు పొడిబారిన వెంటనే కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌కు తరలించాలని ప్రధాన ఇంజినీర్‌ను ఆదేశించారు. ఎర్రిగెడ్డ సమీపంలో పోర్టుకు సంబంధించిన ట్రైన్ ట్రాక్ వద్ద వ్యర్థాలు నిలిచిపోయి ఉన్నందున పోర్టు అథారిటీకి లేఖ రాసి వాటిని శుభ్రపరిచే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. వ్యర్థాల వల్ల భూమి, వాయు కాలుష్యం ఏర్పడి దుర్వాసన రాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. గెడ్డలో అధికంగా ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయని, జనవరి ఒకటి నుంచి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించడమైందని, ఇకపై గెడ్డల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్లాస్టిక్ రహిత విశాఖను అభివృద్ధి పరచాలని అధికారులకు ఆదేశించారు. పర్యటనలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీరు సంపత్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్లు తారాప్రసన్న, చిరంజీవి, ఏఎంవోహెచ్ డాక్టర్ సునీల్‌కుమార్, పోర్టు సహాయక ఇంజినీరు కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల పోరాటానికి సంఘీభావం



వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్న సిటు నాయకులు

దాబాగార్డెన్స్: కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే చర్యలు వేగవంతం చేసిందని, చండీఘడ్‌లో విద్యుత్ డిస్కంలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి పూనుకుందని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అక్కడి విద్యుత్ కార్మికులు చేస్తున్న పోరాటానికి సిటు విశాఖ జిల్లా కమిటీ సంఘీభావం తెలిపింది. విద్యుత్ డిస్కంల ప్రైవేటీకరణ ఆపాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ చండీఘడ్ రాష్ట్ర డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్‌ను ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ అయిన ఎమినెంట్ ఎలక్ట్రిసిటీకి అమ్మడానికి డిసెంబర్ 4న ఆ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. దీనిని సిటు తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. మన రాష్ట్రంలో కూడా కేంద్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే విద్యుత్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని తక్షణమే విద్యుత్ ప్రైవేటీకరణ చర్యలు విరమించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ప్రజలపై భారం మోపే వేసే చర్యలు ఉపసంహరించుకోవాలని సిటు విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందన్నారు. కార్యక్రమంలో సిటు నాయకులు పి. మణి, వి. కృష్ణారావు, జ్యోతీశ్వరరావు, కుమారమంగళం, యూఎస్ఎన్ రాజు, వై. రాజు, పోలేశ్వరరావు, కె. కుమారి, జి. శ్రీను, ఎన్. రమణ, నూకరాజు, గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నాట్య కళాక్షేత్రం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వెంకట్‌చిన్నారావు, తదితరులు

సీతమ్మధార : స్థానిక షిరిడీ సాయిబాబా మందిరం వద్ద నాట్యం నాట్యకళా క్షేత్రంలో మంగళవారం 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్‌ని నాట్య కళా క్షేత్ర నాట్య గురువు కె.వెంకట్ చిన్నారావు, కళాక్షేత్రం ప్రిన్సిపాల్ కె.మాధవి నృత్య విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీ డెంటల్ కేర్ జనరల్ మేనేజర్ రమేష్, విశాఖ ఆర్ట్స్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటరమణారావు, నాట్య రవళి మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ యు.మహేష్ బాబు, ఎస్.నాగేశ్వరరావు, రంగస్థల దర్శకుడు పి.వి.రమణమూర్తి, డి.రాజేష్ పాల్గొన్నారు.

జెడ్సీకి సచివాలయ ఉద్యోగుల కృతజ్ఞతలు



జెడ్సీ మల్లయ్యనాయుడుకు శుభాకాంక్షలు చెబుతున్న సచివాలయ ఉద్యోగులు

మహారాణిపేట: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ఎంతో సహకారం అందిస్తున్న జీవీఎంసీ జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సాయంత్రం జోన్-4 కార్యాలయంలో ఉన్న జెడ్సీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న ఉద్యోగులందరికీ మంచి జరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చింతకాయల బంగారురాజు, బీవీ అశోక్‌కుమార్, ఈ.పవన్‌కుమార్, కర్రీ రాజేష్, నాగేశ్వరరావు, గీత, ఎస్. నవీన్, బి.ఎ. రాజు, మురళి, జయప్రకాష్, వెంకటకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లీగల్ కౌన్సిల్ ఎంపికలో తీరని అన్యాయం



పత్రాలు చూపుతున్న పాకా సత్యనారాయణ

దాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లీగల్ కౌన్సిల్ ఎంపికలో దళితులు, మహిళలకు తీరని అన్యాయం జరుగుతోందని సీనియర్ న్యాయవాది పాక సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. లీగల్ సెల్ నియామకాలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధంగా జరుగుతున్నాయన్నారు. చట్టప్రకారం కేటాయించబడిన రిజర్వేషన్లు తుంగలో తొక్కి, స్వార్థపూరిత ఆలోచనలతో కౌన్సిల్ ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటుందని ధ్వజమెత్తారు. 33 శాతం మహిళలకు ఇవ్వాల్సిన రిజర్వేషన్ కల్పించకపోగా, దళితుల పట్ల చిన్న చూపు చూడడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. జీవీఎంసీ కమిషనర్‌కి పలు మార్లు వినతి పత్రం అందజేశామని, తమకు రావాల్సిన రిజర్వేషన్ తమకు ఇచ్చి తీరాలని, లేకుంటే న్యాయ పోరాటం తప్పదని సత్యనారాయణ హెచ్చరించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



కనకమహాలక్ష్మి పూజలు చేస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ శేష జీవితానికి పునాది



ఉద్యోగ విరమణ పొందిన వారితో అధికారులు

దాబాగార్డెన్స్: సుదీర్ఘకాలం విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం ప్రతి ఉద్యోగికి తప్పనిసరని, ఉద్యోగ విరమణ శేష జీవితానికి పునాది వంటిదని జీవీఎంసీ అదనపు కమిషనర్ బీవీ రమణమూర్తి పేర్కొన్నారు. జీవీఎంసీలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన నలుగురు ఉద్యోగులను మంగళవారం ఆయన సత్కరించారు. ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఉద్యోగి శేష జీవితం ఆనందంగా సాగాలని అభిలషించారు. ఉద్యోగ విరమణ పొందిన పి. కనకారావు, కె. రత్నవతి, టీవీ కోటేశ్వరరావు, ఎం. పార్వతిని సత్కరించారు. అనంతరం ప్రావిడెంట్ ఫండ్ అందజేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి అప్పలనాయుడు, సూపరింటెండెంట్లు రియాజ్, వి. సన్యాసిరావు, రెవెన్యూ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా వైజ్ఞానిక ప్రదర్శన

సీతమ్మధార : స్థానిక వసంతబాల పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ ఘనంగా ప్రారంభమైంది. సీతమ్మధార మండల పరిధిలోని ఆరు ఉన్నత పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నమూనాలు పలువురిని అబ్బురపరిచాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికి ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. సీతమ్మధార మండల విద్యాశాఖాధికారులు డి.రామారావు, కేపీ బాలామణి, హెచ్ఎం కె.రాము పాల్గొన్నారు.